చారు.. ముద్ద అన్నం

- అమలుకు నోచుకోని మెనూ
- కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ సమీపంలోని టీటీడబ్ల్యూఆర్‌జేసీలో దుస్థితి
- కొరవడుతున్న ఉన్నతాధికారుల పర్యవేక్షణ


నీళ్ల మాదిరిగానే చారు


వర్కర్ లేకపోవడంతో భోజనం వడ్డించుకుంటున్న విద్యార్థి

ఆదిలాబాద్‌రూరల్: అది మారుమూల ప్రాంతంలోని వసతి గృహం కాదు. జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల. ఇక్కడ సుమారు 640 వరకు పాఠశాల, 340 వరకు కళాశాల, 160 వరకు స్టార్ 50 విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే స్టార్ 50లో చదివే బాలికలు మాత్రం గిరి వసతి గృహానికి వెళ్లి భోజనం చేస్తుంటారు. బాలురు మాత్రం ఇక్కడే భోజనం చేస్తుంటారు. అయితే వారికి మెనూ ప్రకారం భోజనం అందడం లేదు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందని ద్రాక్షగానే మారింది. దీనికి నిదర్శమే 'సాక్షి' శుక్రవారం ఉదయం పూట టిఫిన్ సమయంలో వెళ్లినప్పుడు చింత పండు నీళ్ల చారు.. ముద్ద అన్నం కనిపించింది. జిల్లా కేంద్రంలోని గురుకుల పాఠశాల దుస్థితి ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లోని వసతి గృహాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థమవుతుంది.

విద్యార్థులే వడ్డన..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలురు పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సరిపడా వర్కర్‌లు లేరని, దీంతో విద్యార్థులే స్వయన ఎవరిది వారు వడ్డను చేసుకుంటూ కనిపించారు. ఇదేంటినని అక్కడి సిబ్బందిని పలుకరించగా సరిపడేంత వర్కర్‌లు లేరని సమాధానం చెప్పారు.

సగం మందే వర్కర్‌లు..

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 12 మంది వర్కర్‌లు ఉండవాల్సిన చోట ఆరుగురు మాత్రమే ఉన్నారు. సిబ్బంది కొరత కారణంగా ఉన్న వారిపై అదనపు భారం పడుతుంది. దీంతో వర్కర్‌లు చేయవాల్సిన పనిని కొన్ని పనులను విద్యార్థులే స్వయన చేసుకుంటున్నారు.

పర్యవేక్షణ కరువు..

కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న అధికారి ప్రస్తుతం ఆర్‌సీవోగా అదనపు బాధ్యలు చూసుకుంటున్నారు. ఆయన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వరిస్తున్న చోటే పర్యవేక్షణ కొరవడుతుంది. దీంతో విద్యార్థులు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ విషయంపై 'సాక్షి' ఆయనను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

క్లుప్తంగా

గ్రామస్తుల శ్రమదానం


మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామ పంచాయతీ పరిధిలోని కోసుపటేల్ గూడ గ్రామ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతింది. దీంతో గ్రామస్తులందూ కలిసి రోడ్డును బాగు కోసం శ్రమదానం చేశారు. యువకులు, గ్రామ పెద్దలు అందరూ కలిసి గుంతలమయమైన రోడ్డుపై మొరం వేసి మరమ్మతులు చేశారు.

'పోషణ్ అభియాన్'పై అవగాహన

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌పై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల శారీరక ఎదుగుదల, ఆరోగ్యవంతంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు వనజ, అశోక్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ హేమలత, సావిత్రి, కుస్మతాయి పాల్గొన్నారు.

పంచాయతీ బిల్లులు విడుదల చేయాలి


ఎంపీడీవో మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

తాంసి: గ్రామ పంచాయతీలకు సంబంధించి పెండింగ్‌లో బిల్లులు వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని మండల పంచాయతీ కార్యదర్శులు తాంసి ఎంపీడీవో మోహన్ రెడ్డిని కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర పనులు చేపట్టేందుకు సొంత డబ్బులు వెచ్చిస్తున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు గంగన్న, సూర్యకాంత్, నరేశ్, రాజు, కార్తీక్, తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి


ఇచ్చోడ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జామిడి అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం అందచేస్తున్న పౌష్టికాహారాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రాజ్‌మోహన్

తలమడుగు: రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్ని గ్రామాల్లో రేషన్ డీలర్లు అందుబాటులో ఉండడం లేదన్నారు. పేద ప్రజలకు అందించే రేషన్ బియ్యం అక్రమంగా ఇతరులకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ ప్రభాకర్, రాకేశ్, రమేశ్, మూస, గజనన్ పాల్గొన్నారు.

మహాగావ్‌లో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నార్నూర్: మండలంలోని మహాగావ్, మాన్కాపూర్ గ్రామాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలన్నారు. ఇంటి ఆవరణంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో హెచ్ఈవో రాథోడ్ తులసీదాస్, సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్ దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


సభ్యత్వం అందజేస్తున్న ఆడే గజేందర్

గుడిహత్నూర్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అలాగే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. అదే క్రమంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికంట్ల ఆశమ్మ, గౌరవ అధ్యక్షురాలు ఆడే శీలా, ప్రధాన కార్యదర్శి మంధని సోనియా, మండల అధ్యక్షురాలు ఉయికె అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇచ్చోడ: గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 28న నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరగంటి అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో మాట్లాడారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. మౌలిక సదుపాయలతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం మూడంచెల పోరాట కార్యాచరణ రూపొందించడం జరిందన్నారు. కార్యక్రమంలోటీఎస్ యూటీఎఫ్ ఇచ్చోడ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యాం సుందర్, మండల కమటీ సభ్యులు చందా విఠల్, జ్ఞానోభా, మల్లేశ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి



ఎస్సై మహేశ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం కృషి చేయాలని శుక్రవారం గాదిగూడ ఎస్సై మహేశ్‌ను గ్లోబల్ హ్యూమన్ రైట్స్ బృందం సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏజెన్సీలో ఆదివాసీ గిరిజనులపై అనేక దాడులు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. సమాజంలో స్వచ్ఛత, మహిళ, పురుషుల మీద జరిగే అన్యాయాలను అరికట్టేందుకు, కుల బహిష్కరణ నిర్మూలించేందుకు గ్లోబల్ హ్యూమన్ రైట్స్ పని చేస్తోందన్నారు. నేటి బంద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు గేడం సెడ్మ, సాక్రే, శంకర్, చిక్రం త్రిపతి, పెందూర్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి


మాట్లాడుతున్న అరెల్లి మల్లేష్

ఇచ్చోడ: అక్రమంగా నడుస్తున్న మైనింగ్ క్వారీల అనుమతులు రద్దు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా స్టోన్ క్రషర్లు, క్వారీలు నడుస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతుందన్నారు. ఈనెల 16న బజార్‌హత్నూర్ మండలంలోని పిప్పరి వద్ద 12 ఏళ్ల అమ్మాయి క్వారీలో పడి మృతి చెందిందన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు దుబ్బాక సుభాష్, సిరిసిల్ల భూమయ్య, జన్నారపు సాయి, చిట్టి రవి, చందు, సుంకె అనిల్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

బోథ్: ఆదివాసీలు శనివారం తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు ప్రజలు. వ్యాపారస్తులు సహకరించాలని ఆదివాసీ నాయకులు కోరారు. మండల వ్యాప్తంగా దుకాణాలు, విద్యాసంస్థలను స్వచ్ఛందంగా మూసివేయాలని కోరారు. జైనూర్‌లో ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యయత్నానికి నిరసనగా బంద్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారానికి నిరసనగా శనివారం తుడుందెబ్బ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నామని రాజు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని చించుఘాట్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తుడుందెబ్బ దాని అనుబంధ సంఘాలు ఇచ్చినా బంద్‌లో ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ నేతలు కుమ్ర జంగబాపు, అశోక్ కుమార్, కిరణ్ పాల్గొన్నారు.

బైక్ చోరీ

ఎదులాపురం: పట్టణంలోని టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 18న బైక్ చోరీ అయినట్లు హెడ్ కానిస్టేబుల్ మధన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పట్టణంలోని మసూద్‌నగర్‌కు చెందిన శంషేర్ అలీఖాన్ ఈనెల 18న స్థానిక విద్యానగర్ లోని మసీదుకు ప్రార్థనల నిమిత్తం వెళ్లాడు. ప్రార్థనలు ముగించుకుని తిరిగి వచ్చి చూసే సరికి బైక్ కనిపించలేదు. చుట్టు పక్కల వెతకగా బండి దొరకక పోవడంతో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సామ రూపేశ్ రెడ్డి

బేల: మండలంలోని దుబ్బగూడ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించారు. రేషన్, కరెంటు స్తంభాలు, రోడ్డు గురించి ఆరా తీశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి న్యాయం చేస్తానన్నారు. నాయకులు ప్రమోద్ రెడ్డి, మాజీ సర్పంచ్ టేకం రాజు, ఆత్రం సోనేరావు, కొడప లంకు, మడావి జంగు, కుమ్ర రాజు, మొకేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం


మాట్లాడుతున్న కాంబ్లే బాలాజీ

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, హిందీ అధ్యాపకులు కాంబ్లే బాలాజీని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష జాతీయ సమైక్యతను చాటి చెప్పే భాష అన్నారు. హిందీ నేర్చుకుంటే ప్రపంచంలో ఎక్కడైనా రాణించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చదల నరేశ్, ఉదయ్ కుమార్, వెంకట రమణ, లింగంపల్లి సుజాత, దోమకుండా సుజాత, జ్వలందర్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

తలమడుగు: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో విష జ్వరాలు విజృంభిస్తున్న గ్రామాల్లో ఎందుకు వైద్య శిబిరాలు నిర్వహించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారని, కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా.. సిబ్బంది తీరు మారడం లేదన్నారు. ఆమె వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, వైద్య సిబ్బంది, శైలజ, సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి


నీటిని తొలగిస్తున్న అధికారులు

తాంసి: ఇంటి ఆవరణలో మురికి నీరు నిల్వ ఉండకుండా, ప్లాస్టిక్ డబ్బాలలో సైతం నీరు ఎక్కువ రోజులు ఉంచవద్దని మండల ప్రత్యేకాధికారి సీపీవో వెంకట రమణ సూచించారు. శుక్రవారం మండలంలో ని గోట్కూరి గ్రామంలో డ్రై డేలో భాగంగా ఎంపీడీవో మోహన్ రెడ్డి, సిబ్బందితో కలిసి గ్రామంలో అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ టైర్లలో, వాడి పడేసిన డబ్బాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వారి వెంట ఎంపీవో లింగయ్య,పంచాయతీ కార్యదర్శి హమీద్, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు వరం 'కల్యాణలక్ష్మి'

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఇంద్రవెల్లి: పేదలకు వరం కల్యాణలక్ష్మి అని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 73 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందన్నారు. త్వరలో లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, సోమోరే నాగోరావ్, పవార్ దుదిరామ్, జితేందర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇల్లు లేని పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ప్రకటించారు.

ప్రశాంతంగా గణనాథుల నిమజ్జనం


నేరడిగొండ: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


బోథ్: నిర్వాహకులతో సీఐ, ఎస్సై

బోథ్: మండల కేంద్రంలో గణనాథుల నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని చైతన్య, భగత్‌సింగ్, హనుమాన్, మిత్ర, లయన్స్, వెపన్స్, ఫ్రెండ్స్ రాక్‌స్టార్‌తో పాటు పలు గణపతుల నిమజ్జనాలు గురువారం సాయంత్రం ప్రారంభమై, శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగాయి. సీఐ రమేశ్, ఎస్సై ప్రవీణ్ కుమార్‌ల ఆధ్వర్యంలో బందోస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పెద్ద వాగు వద్ద వినాయకులను నిమజ్జనం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ, ఎస్సైలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేరడిగొండ: మండల కేంద్రంలోని న్యూ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేష్ నిమజ్జన శోభాయాత్రను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 14 రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుడికి భక్తులు వీడ్కోలు పలికారు. జై.. జై గణేషా అంటూ నినాదాలు చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ యువకులు, గ్రామస్తులు నిమజ్జన శోభాయాత్ర చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

కార్యవర్గం ఎన్నిక


గుడిహత్నూర్: ఎన్నికైన సభ్యులు

గుడిహత్నూర్: పీఆర్టీయూ కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అష్టం అంబరీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా సోన్‌కాంబ్లే సోనేరావ్, ఉపాధ్యక్షురాలిగా టి. సువర్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీంద్రనాథ్, కార్యదర్శిగా సత్యనారాయణను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు, ఉపాధ్యా య సిబ్బంది వీరిని ఘనంగా సన్మానించారు.

మాల సంక్షేమ సంఘం..

ఆదిలాబాద్‌రూరల్: మాల సంక్షేమ సంఘం ఆదిలాబాద్ పట్టణశాఖ కార్యవర్గాన్ని జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దేవత ప్రభుదాస్, అధ్యక్షుడిగా దువ్వాస దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎంబడి ప్రదీప్ కుమార్, కోశాధికారిగా నల్ల రవీందర్, ఉపాధ్యక్షుడిగా పతిహర రమేశ్, జాయింట్ సెక్రటరీగా అయిండ్ల సుదర్శన్, సెక్రటరీలుగా ఇందూరు వికాస్, గోక గంగరాజు, మహిళా ఉపాధ్యక్షురాలిగా నేతుల సురేఖ, మహిళా కార్యదర్శిగా కారంగు మనో రంజనీ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కామెరి చంద్రశేఖర్, సభ్యులుగా తలారి గంగన్న, బాతూరి అనిల్, కాడి రవీందర్, బిట్ల భజరంగ్, బంజ సునీల్, మద్దెల మనోజ్, పులి ఆదిత్య, సంగెం దినేష చిల్క అరుణ్, కాడె లక్ష్మణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

బేల తహసీల్దార్‌గా రఘునాథ్‌రావు

బేల: మండల తహసీల్దార్‌గా కొట్నాక రఘునాథ్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ నుంచి ఇక్కడికి పదోన్నతిపై వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్ రావు, ఆర్ఐలు, సిబ్బంది సన్మానించారు.

సభ విజయవంతం చేయండి

ఎదులాపురం: తెలంగాణ యుద్ధనౌక గద్దర్, సియాసత్ ఎడిటర్ జహీర్ అలీఖాన్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని సభ ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు సోగల సుదర్శన్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు సంద అశోక్, లక్ష్మారెడ్డి, పరమేశ్వర, అర్పత్ ఖాన్ పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలో ఇటీవల గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించిన మావల ఎస్సై విష్ణు వర్ధన్‌ను రాష్ట్రీయ హిందూ వాహిణి సంఘం నాయకులు శుక్రవారం సత్కరించారు. నాయకులు స్వరూప, సందీప్, శీను, వంశీ, నితిన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

తాంసి: భీంపూర్ మండలంలోని భగవాన్‌పూర్ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు ప్రీతం కుమార్‌ను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజు, వీణాబాయి, రాము, రేష్మ, మల్కు పటేల్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చాలి

ఇచ్చోడ: ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చాలని కోకస్‌మన్నూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ముఖరా(బి), జల్దా, గేర్జం, ముఖరా(కె) పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. సీఆర్పీలు శ్యాసుందర్, రూం టూ రీడ్ కోర్డినేటర్ ఉదయ శ్రీ పాల్గొన్నారు.

బీసీ వసతి గృహం తనిఖీ

తలమడుగు: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను, బీసీ వసతి గృహాన్ని మండల ప్రత్యేకాధికారి గజానంద్ శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో చంద్రశేఖర్, హెచ్ఎం వెంకట్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఫిట్స్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ కోర్టు ప్రాంగణంలో శుక్రవారం భీముడు అనే కానిస్టేబుల్‌కు ఫిట్స్ వచ్చి పడిపోయాడు. గమనించిన సీసీఎస్ కానిస్టేబుల్ గంగారెడ్డి, ఐటీ కోర్ కానిస్టేబుల్ మజీద్ వెంటనే రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన రిమ్స్ వైద్యులు ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు.

నోటు బుక్స్ పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: స్మైల్ సొసైటీ సభ్యుడు గుర్నులే రామకృష్ణ జన్మదినం సందర్భంగా శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని మావల మండలంలో గల దుర్గానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.